క్లుప్తంగా

గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

చింతపల్లి : గిరిజనులు పండించిన పంటలు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యమని గిరిజన వికాస్ ప్రతినిధి ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో మాతోట సమావేశాన్ని రైతులతో నిర్వహించారు. గిరిజనులు పండించిన కాఫీ, పసుపు, మిరియాలు, అల్లం, రాజ్‌మా తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలనేది మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రధాన లక్ష్యమన్నారు.కాఫీ పండ్లు కిలో రూ.44 ధరను చెల్లిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో గిరిజనుల పంటలకు మరింత గిట్టుబాట్టు ధరలు చెల్లించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. మాతోట చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, సీఈవో చిన్నారావు, ముఖ్య అతిథి నూకరాజు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ అమలుచేయాలి

అరకులోయటౌన్: రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసమే మహిళా బిల్లును బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సుజాత సాల్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లు ఎన్నికల ముందు తెరపైకి తీసుకురావడంలో అర్థం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు

కొయ్యూరు: ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు.ఆడాకుల పంచాయతీ కించెలిలో శనివారం మండల నేత పొట్టిక మల్లేశ్ అధ్యక్షతన మండల సమితి సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రావణాపల్లి ఎంపీటీసీ ఇరువాడ సత్యవేణి, సత్యనారాయణ, కొండలరావు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



రాజధాని జంక్షన్ వద్ద నోటీసుబోర్డు ఏర్పాటు చేస్తున్న ఈవో, పంచాయతీ సిబ్బంది

అరకులోయటౌన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని పద్మాపురం మేజర్ పంచాయతీ ఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పద్మాపురం గార్డెన్, రాజధాని జంక్షన్, అరకులోయ-యండపల్లివలస మార్గంలోని వంతెన వద్ద, యండపల్లివలస ప్రాంతాల్లో శనివారం నోటిసు బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు పక్కన చెత్తవేస్తే రూ. 500 జరిమాన తప్పదన్నారు. శానిటేషన్ పనుల్లో భాగంగా ఈ బోర్డులు ఏర్పాటు చేశామని, ఎవరైనా పంచాయతీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



కాలేజీలో రక్తదానం శిబిరం

హుకుంపేట: ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బీజేవైఎం, స్థానిక ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ కళాశాల వద్ద శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అరుకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురామరాజు, ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. శిబిరంలో 15 మంది రక్తదానం చేసినట్టు చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీవోలు రమేష్ నాయుడు, నాగకిరణ్, సర్పంచ్ శాంతికుమారి, బీజేపీ నాయకులు రాజారావు, కొండబాబు, గాసన్న, పాత్రుడు, పద్మరాజు పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక చేయూత

- పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం
- సంరక్షణకు మూడేళ్ల పాటు నిధులు
- ఆనందంలో రైతులు



కొత్తాడలో జీడిమామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ కామరాజు(ఫైల్)



జీడిమామిడి మొక్కలు నాటుతున్న గిరిజనులు

గంగవరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పండ్ల తోటల పెంపకం కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 59 గ్రామాల్లో రూ 19.86 కోట్లతో 869 పనులు చేపట్టేందుకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, ఫారంపాండ్ల నిర్మాణం, పండ్ల తోటల వద్ద కందకాలు, చెరువుల్లో రాతి కట్టడాలు, భూమి చదును పనులతో పాటు పండ్ల తోటల పెంపకం కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల పండ్ల తోటలు , జీడిమామిడి మొక్కలు పెంపకానికి గిరిజన రైతులు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. మండలంలో 14 పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 317 మంది రైతులను గుర్తించారు. ఇందుకోసం జీడిమామిడి, మామిడి, నిమ్మ, జాఫ్రా, కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఒక రైతుకి, ఒక ఎకరానికి జీడి మామిడి తోటల పెంపకం కోసం రూ.93,716లు అందజేస్తోంది. రైతుకి మొక్కల సంరక్షణ నిమిత్తం మూడు సంవత్సరాల్లో ప్రతి నెల మస్తర్ ద్వారా పేమెంట్ సొమ్మును జమచేస్తోంది.

పనులకు సంబంధించిన నిధులు

మొక్కలు నాటడం, గుంతల తవ్వకం, అంటుకట్టడం, మొక్కలకు నీరు పెట్టడం, ఫెన్సింగ్ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ఆయా పనులకు గాను మొదటి సంవత్సరం రూ.36,805.75, రెండో సంవత్సరం రూ 26,340.45, మూడవ సంవత్సరం రూ.రూ 24,122.56 వెరసి మూడు సంవత్సరాల్లో రైతుకు రూ.87,268.76 లు లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

ఉపాధిలో ద్వితీయ స్థానం



ఉపాధి పనుల అమలులో రంపచోడవరం డివిజన్‌లో గంగవరం మండలం ద్వితీయ స్థానంలో ఉంది. ఇప్పటి వరకు మూడు లక్షల 48వేల ఐదువందల 20 రోజుల పనిదినాలు కల్పించాం. ఇందులో భాగంగా 217 కుటుంబాలు 100 రోజులు పని దినాలు పూర్తి చేశారు. ప్రతీ చోటా పనులు కల్పిస్తున్నాం. **- బి.శ్రీనివాసులు,** ప్రోగ్రామింగ్ ఆఫీసర్, ఎన్ఆర్ఈజీఎస్, గంగవరం

నాణ్యమైన మొక్కల పంపిణీ



రైతులకు నాణ్యమైన పండ్ల మొక్కలను సరఫరా చేశాం. డివిజన్ స్థాయి అధికారులు పరిశీలించి, ధృవపరిచిన నర్సరీలలో టెక్నికల్ టీం సర్టిఫై చేసిన నాణ్యత కలిగిన మొక్కలు తీసుకొని రైతులకు అందజేశాం. ఇందులో భాగంగా 303 మంది రైతులు 323.50 ఎకరాల్లో జీడి మామిడి మొక్కలు నాటడం జరిగింది.

- ప్రకాష్, ఏపీవో (అడిషినల్), గంగవరం

పెంపకంపై అవగాహన



మండలంలో ప్రధానంగా గిరిజన రైతులు పండ్ల తోటలు పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు జీడిమామిడితో పాటు వివిధ పండ్ల మొక్కలను సరఫరా చేస్తున్నాం. తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలోని 14 పంచాయతీల్లో గుర్తించిన రైతులకు మొక్కలు అందజేశాం.

- రామకృష్ణంరాజు, ఏపీఓ, గంగవరం

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాళ్లు

అరకులోయటౌన్: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు వలంటీర్లుగా చేరుట వలన నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్స్‌పాళ్లు డాక్టర్ కె.పుష్ప రాజ్, పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.వి జయలక్ష్మీ, ఎం.అనిత కుమారి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు తదితరులు ఎన్ఎస్ఎస్ డే ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గణేష్, సుందరిరాణి, గుర్రయ్య, రాజు, గోపాలకృష్ణ, అప్పారావు, కామేశ్వరరావు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలి



మెహబూబూ పాషా



ఎస్.కె.ఫయాజ్ బాషా

గంగవరం: విజయవాడలో వచ్చే నెల 17న నిర్వహించనున్న రాష్ట్ర రెవెన్యూ కౌన్సిల్ సమావేశానికి సిబ్బంది అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రంపచోడవరం డివిజన్ ఏపీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మెహబూబ్ పాషా(అక్రమ్), ఎస్.కె.ఫయాజ్ బాషా(జిలానీ) పిలుపునిచ్చారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో పాల్గొనేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆయా ఉత్తర్వులను కలెక్టర్ దృష్టికి జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు చిన్నికృష్ణ త్రినాథరావు నాయుడు, అప్పలస్వామి తీసుకు వెళ్లారన్నారు. ఈ మేరకు జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు కౌన్సిల్‌లో పాల్గొనేందుకు అనుమతిని ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. రంపచోడవరం డివిజన్ లో పనిచేస్తున్న రెవిన్యూ ఉద్యోగులు కౌన్సిల్‌కు హాజరై విజయవంతం చేయాలని రంపచోడవరం డివిజన్ ఏపీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు మెహబూబ్ పాషా (అక్రమ్), యస్.కె.ఫయాజ్ బాషా కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరుణ్‌కిరణ్, ప్రిన్సిపాల్ అన్నమణి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అన్నమణి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ అరుణ్‌కిరణ్ మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం



జి.మాడుగులలో ఆకట్టుకున్న శక్తివేషాలు



పాడేరులో గణనాథుని ఊరేగింపు

సాక్షి, పాడేరు/ జి.మాడుగుల/దుంబ్రిగుడ/చింతపల్లి/వై.రామవరం/రాజవొమ్మంగి: ఏజెన్సీలో వినాయక చవితి ఉత్సవాల సందడి నెలకొంది.పలు ప్రాంతాల్లో పూజలందుకుంటున్న గణనాథుని విగ్రహాలను శనివారం సాయంత్రం ఘనంగా ఊరేగించి, సమీప గెడ్డలు, నదీజలాల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో థింసా నృత్యాలు ఆకట్టుకునానయి. పలు ప్రాంతాల్లో భారీ సమారాధన నిర్వహించారు. పాడేరులో గుడివాడగడ్డికాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోని గణేష్ మండపం వద్ద శనివారం రాత్రి సహస్ర దీపారాధన కార్యక్రమంను నిర్వహించారు.జి.మాడుగుల మండలం గాం. దీనగరం గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనం ఊరేగింపులో శక్తి వేషాలు, కోలాటాలు, వినాయక వేషధారణ ఆకట్టుకుంది ఈదులబయలు గ్రామ సమీపంలో వినాయకుని నిజ్జనం కార్యక్రమం నిర్వహించారు. దుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ కొసాంగుడలో జరిగిన గణేష్ నిమజ్జనంలో గ్రామస్తులు, యువత సందడి చేశారు. చింతపల్లిలో మైలుకూలివీధిలో భారీ భారీ అన్నసమారాధన జరిగింది. వై.రామవరం మండలంలోని పనసలపాలెం, దద్దికివాడ, శింగవరం, దేవరమడుగులు తదితర గ్రామాల్లో వినాయకులను ట్రాక్టర్లపై ఊరేగించి, దేవరమడుగులు గ్రామ పెద్దేరువాగులో నిమజ్జం చేశారు. రాజవొమ్మంగి మండలంలోని శివాలయం వీధి, షిరిడీసాయినగర్, అప్పలరాజుపేట, కమ్మరిపేటల్లో గణనాథులను ఊరేగించి, సమీప వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.



జి.మాడుగులలో మహిళల కోలాటం



పనసలపాలెంలో గణనాథుని ఊరేగింపు



కోసాంగుడలో సందడి చేస్తున్న గ్రామస్తులు



రాజవొమ్మంగిలో ట్రాక్టర్‌పై గణనాథుని ఊరేగింపు



చింతపల్లి గణేష్ ఊరేగింపులో గిరిజన మహిళలు

జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృత ప్రచారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు

గూడెంకొత్తవీధి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సిబ్బందికి తెలియజేశారు. సచివాలయ, వైద్య సిబ్బందితో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొండిగూడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం త్వరలో నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరానికి వైద్య నిపుణులు వస్తారని, రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరం నిర్వహణ, ఏర్పాట్లపై వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బ్రోచర్‌ను పంపిణీ చేయాలని సూచించారు. ఈవోఆర్‌డీ పాపారావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంఈవో సూరారెడ్డి

రాజవొమ్మంగి: అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలు, సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దామని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పిలుపు ఇచ్చారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ మండంలోని అనేక సీసీ, బీటీ రహదారులు, కల్వర్టుల నిర్మాణం కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయని, వాటి నిర్మాణంలో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఇప్పటికే అప్పలరాజుపేట, డి.మల్లవరం, జడ్డంగి గ్రామాల్లో రహదారి పనులు ప్రారంభమైనట్టు తెలిపారు. డ్వాక్రా మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.12 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేసినట్టు ఏపీఎం ఆదినారాయణరావు వివరించారు.అవసరమైన వారికి చిరు వ్యాపారం కోసం ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం ద్వారా రుణ సదుపాయం కలిస్తోందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండంలోని పలు ప్రాంతాల్లోని యూపీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సమస్యతో పాటు నాడు-నేడు పనుల్లో లోపాలపై పలువురు సభ్యులు ప్రస్తావించారు. దీనిపై ఎంఈవో సూరారెడ్డి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశానికి మైనర్ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు గైర్హాజరు విషయాన్ని పలువురు సభ్యులు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు వద్ద ప్రస్తావించారు. ఆయన స్పందించి, సమావేశానికి రాని అధికారుల వివరాలను కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, సొసైటీ చైర్‌పర్సన్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో శనివారం వారపు సంతలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి సంతకు వచ్చిన వారంతా అన్నసంతర్పణ పాల్గొన్నారు. సుమారు 4వేల మందికి పైగా ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు చెప్పారు. సంఘం సభ్యులు ఉదయ్‌కుమార్, నీలకంఠం, బాబూరావు, ప్రసన్నకుమార్, జోగారావు, శ్రీను, మురళి, సురేష్, కృష్ణ, శ్యామ్, ప్రసాద్, గణపతిరాజు, సాయి, శివ పర్యవేక్షించారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం రామాలయంలో వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం భారీ అన్నసమరాధన చేశారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు అంబటి నూకాలు, రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

జి.మాడుగుల: భూ రీసర్వేతో భూ సమస్యలు పరిష్కరమవుతాయని ప్రజల సహకరించాలని తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ శంకులమిద్దే గ్రామంలో భూ రీసర్వేలో భాగంగా శనివారం గ్రామ సభ జరిగింది. తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర మాట్లాడుతూ రీ సర్వేలో 25 మందికి పట్టాలు మంజూరయ్యాయని, త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు నిమిత్తం ప్రభుత్వం భూ రీసర్వే కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. మాజీ సర్పంచ్ గబ్బాడి పండుదొర సింగర్బ సచివాలయ కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు, డీటీ మోహన్‌రావు, సర్వేయర్ మత్స్యరాస జయ సింహరాజు, శ్రీకాంత్, వీఆర్వోలు దాసుబాబు, కాంతారావు, మూర్తి, వీఆర్ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యంపై హర్షం



మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

కూనవరం: వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇవ్వడం పట్ల విలీన మండలాల్లో పోలవరం ప్రాజెక్టు ముంపు పొలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌లు రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రిని విజయవాడలో కలిసి పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంత పొలాల్లో బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. మంత్రి వెంటనే స్పందించి సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో రైతులందరికీ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో మంత్రికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రైతులు ఉమ, దివాకర్, హనుమంతరావు, రహీమ్, నాగేశ్వరరావు, రాజారావు తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

26 కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు.. పరారీలో మరొకరు



గంజాయి నిందితుడితో ఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు

జి.మాడుగుల : స్కూటీపై అక్రమంగా మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గెమ్మెలి పంచాయతీ కులుపాడు వద్ద శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పెదబయలు మండలం గుంజివాడ గ్రామానికి చెందిన వంతాల నాగూర్, మరొక వ్యక్తి స్కూటీపై 26 కిలోల గంజాయి నర్సీపట్నం వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో నాగూర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని అన్నారు. సీఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు గంజాయి నిందితుడు వంతాల నాగూర్‌పై కేసు నమోదు చేసి, గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

గంజాయి సాగుదారుడి అరెస్టు

జి.మాడుగుల : మండలంలో కోరాపల్లి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు స్థానిక పోలీసులు శనివారం దాడి చేసి సాగుదారుడు చేదల బోడేశ్వరదొరను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ శ్రీనివాస్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన చెదల బోడేశ్వరదొర గంజాయి పంట సాగు చేస్తున్నాడని పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ నెల19న దాడి చేసి 3 ఎకరాల గంజాయి పంటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. బోడేశ్వరదొరను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బోరు పనులు ప్రారంభం

ముంచంగిపుట్టు: ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామంలో బోరు నిర్మాణ పనులను సర్పంచ్ ఎస్.నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ , జర్రెల పంచాయతీ కాంగువీధిలో బోరు పనులను సర్పంచ్ భాగ్యవతి ప్రారంభించారు. ఉపసర్పంచ్ రవణమ్మ, నేతలు రాంప్రసాద్, దామోదరం,సురేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.